# సాక్షి నిజామాబాద్

మంగళవారం । 27 । జూన్ । 2023




## ప్రజావాణికి 141 ఫిర్యాదులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 141 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో ▸



## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గత విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /25.5

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలులు వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 3, 4 తేదీల్లో ఇంటర్వ్యూలు

- బీసీ గురుకులాల్లో ఒప్పంద ప్రాతిపదికన టీచర్ల నియామకం..

**నిజామాబాద్‌అర్బన్:** జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఒప్పంద ప్రతిపాదికన నియామకాలు చేపట్టనున్నట్లు బీసీ గురుకులం ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మధ్యమంలో విద్యాబోధన చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 3, 4 తేదీల్లో కంజరలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. తెలుగు, హిందీ, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు జూలై 3న, ఇంగ్లిష్, ఫిజిక్స్ బయో సైన్స్, గణితం సబ్జెక్టులకు జూలై 4న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అలాగే కళాశాలలకు సంబంధించి జూలై 3న తెలుగు, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులకు, 4వ తేదీన ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, జువాలజీ, బోటనీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూ, డెమోలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి డెమో, ఇంటర్వ్యూలు ప్రారంభమవుయన్నారు. పూర్తి వివరాలకు 63023 42448, 79817 10647 నంబర్లను సంప్రదించాలన్నారు.

### రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన


**నిజామాబాద్‌అర్బన్:** పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి సంబంధించి ఈ నెల 28 నుంచి జూలై 6వ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కౌన్సెలింగ్ సమన్వయకర్త శ్రీరామ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు ఆయా తేదీల్లో మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. ఎంసెట్ ర్యాంక్ కార్డు, ఎంసెట్ హాల్ టికెట్, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఇంటర్మీడియట్ మెమో, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, టీసీ, ఆదాయ, కుల సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. సర్టిఫికెట్ పరిశీలన పూర్తయిన వారు ఈనెల 28 నుంచి జూలై 8 వరకు ఆన్‌లైన్‌లో కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నారు.

### 'సివిల్స్' శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్‌అర్బన్:** బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచిత శిక్షణ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ కో–ఆర్డినేటర్ వెంకన్న సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 16న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి ఉచితంగా కోచింగ్‌తో పాటు.. నెలకు రూ. 5వేలు చెల్లించబడుతుందన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 10 లోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 08462–241055 సంప్రదించాలన్నారు.

**మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..**
మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీస్ కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి జూలై 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. జూలై 23న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 040– 2323 6112 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### పోలీస్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు




**ఖలీల్‌వాడి:** ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసినందుకు పోలీస్ సిబ్బందికి ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో పోలీస్ కార్యాలయ సిబ్బంది, హెడ్‌క్వార్టర్స్ సిబ్బంది ఐటీ కోర్ సిబ్బంది సుమారు 130 మందికి ప్రశంసా పత్రాలు అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మధుసూదన్‌రావు(అడ్మిన్), గిరిరాజు(ఏఆర్), ఏసీపీ కిరణ్ కుమార్, ఎస్‌బీ సీఐ శ్రీశైలం, ఏవో శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, సీపీవో కార్యాలయ సిబ్బంది, రిజర్వు విభాగం, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# టమాట @ రూ. 80

## ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

- రూ. 100 పలుకుతున్న పచ్చిమిర్చి
- సామాన్యుడు కొనలేని పరిస్థితికి రేట్లు
- సాగు విస్తీర్ణం పడిపోవడం, అకాల వర్షాలే కారణం!
- మరో నెలరోజులు ఇలాగే ధరలు..?



**సుభాష్‌నగర్ :** కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. మార్కెట్‌లో ఏ కూరగాయ ధర అడిగినా కిలో రూ. 50కి పైనే చెబుతున్నారు. నెల రోజుల క్రితం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాలతోపాటు జిల్లాలోనూ కూరగాయల పంటలు నీటిపాలయ్యాయి. తద్వారా 10 రోజులుగా ధరలు ఏ మాత్రం తగ్గకపోగా.. పైపెచ్చు పెరుగుతున్నాయి. కూరగాయల సాగు కూడా పడిపోవడం ధరల పెరుగుదలకు కారణమని అధికారులు పేర్కొంటున్నారు. టమాట రూ. 80, పచ్చిమిర్చి రూ. 100కిపైగా పలుకుతున్నాయి. కూరగాయలు కొనాలంటే వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు.

■ జిల్లా కేంద్రంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్, ఉమ్రి, కర్నాటకలోని కొన్ని జిల్లా లు, ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, హైదరాబాద్, బోయిన్‌పల్లి, ఒంటి మామిడి, జిల్లాలోని ఆర్మూర్, అంకాపూర్, కృష్ణనగర్, బాడ్సి, పెద్ద బోర్గాం, తదితర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. నిత్యం మార్కెట్‌కు 600 క్వింటాళ్ల వరకు వివిధ రకాల కూరగాయలు వస్తాయి. ప్రతిఏడాది మార్కెట్ ఆదాయం రూ. 60లక్షల వరకు వస్తోంది.

■ హోల్‌సేల్ మార్కెట్ నుంచి నిత్యం జిల్లాలోని బోధన్, బాన్సువాడ, భీమ్‌గల్, ఆర్మూర్‌తో పాటు పక్కనున్న ఇతర జిల్లాలు, మండలాలు, గ్రామాలకు రిటైల్ వ్యాపారులు తీసుకెళ్తుంటారు. సోమవారం నిజామాబాద్ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు 724 క్వింటాళ్ల కూరగాయలు, ఆకుకూరలు వచ్చాయి.

| కూరగాయలు | రిటైల్ (కిలో రూపాయల్లో) | | |
|---|---|---|---|
| | | క్యాప్సికం | 60 |
| | | కొత్తిమీర | 100 |
| టమాట | 80 | బీర్నీస్ | 120 |
| గోరుచిక్కుడు | 60 | పుదీన | 80 |
| బెండకాయ | 40 | క్యాలీఫ్లవర్ | 60 |
| బీరకాయ | 80 | క్యారెట్ | 60 |
| కాకరకాయ | 60 | పాలకూర | 40 |
| వంకాయ | 40 | చామగడ్డ | 50 |
| పచ్చిమిర్చి | 100 | చిక్కుడు | 80 |

### కొనలేకపోతున్నాం



మార్కెట్‌కు వెళ్లి కూరగాయల ధరలు వింటేనే భయమేస్తుంది. ఏ కూరగాయ ధర అడిగినా కిలో రూ. 50కి తక్కువగా చెప్పడం లేదు. పచ్చిమిర్చి, టమాటలు తప్పనిసరి పరిస్థితుల్లో కొనాల్సి వస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కూరగాయల ధరలతో పోలిస్తే పప్పులే నయం అన్న భావన కలుగుతుంది.

– సంజన, గృహిణి, గాయత్రినగర్

### ఉత్పత్తి పడిపోవడంతోనే..

నెల రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు కూరగాయల పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ కారణంగా ఉత్పత్తి పడిపోయింది. దీంతో అధికంగా వినియోగించే పచ్చిమిర్చి, టమాట ధర పెరుగుతూనే ఉంది. రిటైల్ మార్కెట్‌లో కిలో మిర్చి రూ.100, టమాట రూ. 80 వరకు పలుకుతోంది. మరో నెల రోజుల వరకు ధరలు ఇలాగే ఉంటాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.




నగరంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్

# జై జగన్నాథ..

- ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో రేపు నగరంలో రథయాత్ర
- శ్రీ నీలకంఠేశ్వరాలయం నుంచి వినాయక్‌నగర్ వరకు శోభాయాత్ర
- నైవేద్యంగా జగన్నాథునికి 56 రకాల వంటకాలు







రథయాత్ర రూట్‌మ్యాప్

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** పూరి జగన్నాథ్.. ఈ పేరువింటేనే భక్తులకు చెప్పలేనంత అనుభూతి. ఒడిశాలోని పూరిలో ప్రతియేటా నిర్వహించే జగన్నాథ రథయాత్రకు ఉన్న ఖ్యాతి అసాధారణం. ఇదిలా ఉండగా ఇస్కాన్(అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం) ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలు కోట్లాదిమందిని ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇందూరు నగరంలో ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించనున్నారు. ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలోనే జిల్లాలోని బోధన్, ఆర్మూర్ శాఖలు నడుస్తున్నాయి. దీంతో ఆయా డివిజన్ల నుంచి సైతం భక్తులు ఇందూరు రథయాత్రకు రానున్నారు. కంఠేశ్వర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో గతేడాది నుంచి ఈ రథయాత్రను ప్రారంభించారు. రథయాత్ర మధ్యాహ్నం ఒంటి గంటకు నగరంలోని శ్రీ నీలకంఠేశ్వరాలయం నుంచి ప్రారంభమై రైల్వేకమాన్, శ్రీగణేశ్ చౌరస్తా(మున్సిపల్ కార్యాలయం), రైల్వేస్టేషన్, తిలక్ గార్డెన్స్, బస్‌స్టేషన్, మెడికల్ కళాశాల, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, పెద్ద బజార్, శివాజీనగర్ చౌరస్తా(ఆర్ఆర్ చౌరస్తా), పులాంగ్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా సాగనుంది. చివరకు వినాయక్‌నగర్‌లోని విజయలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, మహాహారతి, మహాప్రసాద వితరణ చేయనున్నారు. అలాగే జగన్నాథ స్వామివారికి 56 రకాల నైవేద్యాలు నివేదించనున్నారు.

### ప్రతి ఏడాది నిర్వహిస్తాం



జగన్నాథ రథయాత్ర ఉత్సవాన్ని నిర్వహించడాన్ని గతేడాది ప్రారంభించాం. ఇకమీదట ప్రతి ఏడాది నిర్వహించనున్నాం. ఇందూరులో ఇస్కాన్ ఆలయాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. అయితే ప్రస్తుతం తాత్కాలికంగా ఇస్కాన్ మందిరం, కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే ప్రతి ఆదివారం భజనలు, కీర్తనలు, భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడుతున్నాం. కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు ముందుకెళ్తున్నాం. రథయాత్రకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి.

– రామానందరాయ్ గౌరదాస్, ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు

# 'రైతుబంధు' నిధులు విడుదల

- తొలిరోజు రూ. 27.15 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

**డొంకేశ్వర్(ఆర్మూర్):** వానాకాలానికి సంబంధించిన 'రైతుబంధు' నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాకు సోమవారం 93,502 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 27.15కోట్లకు పైగా డబ్బులు జమయ్యాయి. ఎకరంలోపు భూమి ఉన్న రైతులకే ఈ పంట పెట్టుబడి సాయం అందింది. అయితే, జిల్లాలో కొత్తగా నమోదైన 14,336 మంది రైతులతో కలిపి రైతుబంధు పొందేవారి సంఖ్య మొత్తం 2,82,044కు చేరింది. ఇందుకు రూ. 274.15 కోట్లు అవసరనం కానున్నాయి. తొలిరోజు కొంత మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించిన ప్రభుత్వం, విడతల వారీగా మిగతా రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.

# ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్

- సాగునీటిని వృథా చేయొద్దు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**రుద్రూర్:** వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలుస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి మండలంలో సాగర్ కాలువ ద్వారా ప్రవహిస్తున్న సాగు నీటిని సోమవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మించిన తర్వాత జూన్‌లో కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ రైతుల అభ్యున్నతికి వ్యవసాయ రంగాన్ని అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పెట్టుబడి సాయం అందజేత, ప్రాజెక్టులు, ఎత్తిపోతల నిర్మాణానికి పుష్కలంగా నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రంలో వరి ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని స్పష్టం చేశారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ధాన్యం క్రయవిక్రయాల్లో రైతుల ఇబ్బందులు తొలగించడానికి భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా రైస్ మిల్స్ నిర్వహణ చేపట్టాలనే యోచన ఉందన్నారు. స్పీకర్ వెంట ఇరిగేషన్ ఎస్ఈ వసంతి, ఈఈ రాజశేఖర్, ఏఈలు సత్యనారాయణ, శృతి, మండల ప్రజాప్రతినిధులు ఉన్నారు.



కోటగిరి మండలంలో సాగర్ కాలువను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

# బోధన్‌లో పోటీ చేస్తాం

- ఎమ్మెల్యే షకీల్‌కు బుద్ధి చెప్తాం
- కౌన్సిలర్లపై అక్రమ కేసులు పెట్టారు
- ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ గెలుపునకు కృషి చేశాం
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

**ఖలీల్‌వాడి:** వచ్చే శాసనసభ ఎన్నికలలో బోధన్‌లో ఎంఐఎం పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఎమ్మెల్యే షకీల్‌పై హత్యనేరం కేసులో అరెస్టయిన బోధన్ ఎంఐఎం కౌన్సిలర్లు, వారి కుటుంబసభ్యులను సోమవారం నగర శివారులోని సారంగపూర్ జైలులో ఓవైసీ పరామర్శించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో పోటీ చేయడానికి ఎంఐఎం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో ఎక్కడెక్కడ పోటీ చేస్తామనేది ఎన్నికల ముందు జాబితా ప్రకటిస్తామని అంతకు ముందు పార్టీ శ్రేణులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్‌కు ఎన్నికల ద్వారా తగిన బుద్ధి చెబుతామన్నారు. బోధన్‌లో ఎంఐఎం కౌన్సిలర్లు నాయకులపై అక్రమ కేసు పెట్టారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు ఎమ్మెల్యే షకీల్‌ను కనీసం దుర్భాషలాడలేదని, వారిపై హత్యాయత్నం కేసు పెట్టి అరెస్ట్ చేయడం సరైందికాదన్నారు. అరెస్టయిన ఎంఐఎం కౌన్సిలర్లు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ గెలుపు కోసం పని చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అక్రమ అరెస్టుల విషయం సీఎం కేసీఆర్, డీజీపీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. బోధన్‌లో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ. 30 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోధన్ ఏసీపీ, ఎస్‌హెచ్‌వోను హైదరాబాద్‌కు బదిలీ చేయాలని అక్కడ తరచూ హత్యలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. అధికారం శాశ్వతం కాదనేది గుర్తు పెట్టుకోవాలని ఎమ్మెల్యే షకీల్‌కు హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో బోధన్‌లో బ్యాలెట్ ద్వారా సమాధానం ఇస్తామన్నారు. ఎంఐఎం ముందుగా పార్టీ బలోపేతం కోసం పని చేస్తుందని తెలిపారు. తర్వాత ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే విషయం ఆలోచిస్తామన్నారు. తెలంగాణలో మా క్రికెట్ బ్యాటింగ్ మేం చేస్తామని, మా స్కోర్ మేం చూసుకుంటామని ఆపై ఎవరిని అవుట్ చేయాలనేది ఆలోచిస్తామని తెలిపారు. సచివాలయ నిర్మాణం కోసం మసీదులు తొలగించి నిర్మించారని మసీదులను వెంటనే కట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్‌పాషా, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట రుణ పరిమితి పెంపు

- సాగుకు పెరిగిన పెట్టుబడి ఖర్చు
- రుణాలు ఎంత ఇవ్వాలనే అంశంపై బ్యాంకర్స్ కమిటీ నిర్ణయం

**మోర్తాడ్(బాల్కొండ):** పంటల సాగుకు పెట్టుబడులు పెరుగుతుండటంతో రుణ పరిమితిని పెంచుతూ బ్యాంకర్స్ కమిటీ నిర్ణయం తీసుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలోని వర్షాకాలం సీజను, యాసంగి సీజన్‌లలో సాగుచేసే పంటలకు కొత్తగా పెంచిన రుణాల పరిమితి వర్తించనుంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ఆరంభంలో తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో వివిధ వాణిజ్య బ్యాంకులు, వ్యవసాయ రుణాలు ఇచ్చే బ్యాంకర్ల ఉన్నతాధికారులు సమావేశాన్ని నిర్వహించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితిని) నిర్ణయిస్తారు. ఈసారి గతంలో కంటే రుణాల పరిమితిని కొంత మెరుగ్గానే పెంచారు. వరి పంటలకు గతంలో ఎకరానికి రూ. 40వేల వరకు రుణం ఇచ్చేవారు. ఈ సీజన్‌లో రూ. 42వేల నుంచి రూ. 45వేల వరకు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. పసుపు పంటకు గతంలో రూ. 80వేల వరకు రుణం ఇవ్వాలని నిర్ణయించగా ఇప్పుడు రూ. 5వేలు పెంచి రుణ పరిమితిని రూ. 85వేలుగా తీర్మానించారు. మొక్కజొన్నకు రూ. 32వేల వరకు ఉన్న రుణాన్ని రూ. 34వేలకు పెంచారు. చెరుకు సాగుచేసే పొలాలకు రూ. 80వేల వరకు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. మల్చింగ్ పద్ధతిలో టమాటా సాగుచేసే పొలాలకు ఎకరానికి రూ. 65వేల నుంచి రూ. 70వేల వరకు రుణం ఇవ్వాలని తీర్మానించారు. పంటల రకాలను పరిగణనలోకి తీసుకుని పెట్టుబడులను అంచనా వేసి రుణ పరిమితిని నిర్ణయించారు.

**స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ అమలులో అలసత్వం**
బ్యాంకర్ల ఉన్నతాధికారుల కమిటీ నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను అమలు చేయడంలో క్షేత్ర స్థాయిలో ఉన్న కొందరు బ్యాంకర్లు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రుణ పరిమితిని పెంచినా బ్యాంకర్లు కొందరు పాత లెక్కల ప్రకారమే రుణాలను అందిస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచిన రుణాలను అమలు చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణించాలని రైతులు కోరుతున్నారు. బ్యాంకులు సకాలంలో అవసరం ఉన్నంత రుణాలు ఇస్తే తాము ఫైనాన్స్‌ల జోలికి వెళ్లబోమని రైతులు స్పష్టం చేస్తున్నారు.

# ఇరిగేషన్ ఏఈఈపై దాడి అమానుషం

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన టీఎన్జీవోస్ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

**సుభాష్‌నగర్:** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో ఉన్న జలవనరుల శాఖ ఏఈఈ రాజ్యలక్ష్మిపై దాడి అమానుషమని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ పేర్కొన్నారు. రాజ్యలక్ష్మిపై దాడిని తీవ్రంగా ఖండించారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అలుక కిషన్ మాట్లాడుతూ జలవనరులశాఖ ఏఈఈపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అప్పటివరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. సదరు మహిళా ఉద్యోగికి న్యాయం జరిగే వరకూ ఎంప్లాయిస్ జేఏసీ ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. దాడికి పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఉద్యోగులపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, మాజీ కార్యదర్శి అమృత్‌కుమార్, నీటిపారుదలశాఖ సూపరింటెండెంట్ బద్రినారాయణ, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఉదయ్‌కుమార్, అశోక్‌కుమార్, పోల శ్రీనివాస్, సుమన్‌కుమార్, జాఫర్ హుస్సేన్, సత్యం, అతిక్ అహ్మద్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

**మోపాల్:** తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సోమవారం కొనసాగాయి. ఉదయం 4, 5వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు మొత్తం 8,153 మంది విద్యార్థులకు 7,394 మంది హాజరైనట్లు పరీక్షల నియంత్రణ అధికారిని అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 2, 3వ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు మొత్తం 5,789 మంది విద్యార్థులకు 5,270 మంది పరీక్ష రాశారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయ్యారని పేర్కొన్నారు.




## క్లుప్తంగా

### ఐపీఎస్‌టీఎస్ ప్రధాన కార్యదర్శిగా ఆకుల విశాల్



నిజామాబాద్ సిటీ: ఐపీఎస్‌టీఎస్(ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ) ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ ఆకుల ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రతినిధులు తెలిపారు. రెండు రోజులుగా హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ వార్షిక మహాసభలు జరిగాయి. ఈ సభలకు ఆసియా దేశాల మానసిక సంఘాల అధ్యక్షుడు ప్రసాద్‌రావు, దక్షిణాది రాష్ట్రాల ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఉదయ్‌కుమార్ హాజరు అయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన సభలో రాష్ట్రశాఖ ప్రతినిధులు డాక్టర్ విశాల్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు.

### ఐడీజేఎన్ రాష్ట్ర కో–కన్వీనర్‌గా ఎడ్ల సంజీవ్



ఎడ్ల సంజీవ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఐడీజేఎన్ (ఇండియన్ దళిత్ జర్నలిస్ట్స్ నెట్‌వర్క్) రాష్ట్ర కో–కన్వీనర్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎడ్ల సంజీవ్ ఎంపికయ్యారు. సిద్దిపేటలో ఆదివారం ఆ సంఘం చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మెదక్ ఎంపీ ప్రభాకర్ రెడ్డి, అంథోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ఇందులో భాగంగా ఐడీజేఎన్ రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. రాష్ట్ర కన్వీనర్‌గా సిద్దిపేటకు చెందిన జనార్దన్, కో–కన్వీనర్‌గా నిజామాబాద్‌కు చెందిన ఎడ్ల సంజీవ్‌ను ఎన్నుకున్నారు. ఐడీజేఎన్ ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా ఉంటూ, ముఖ్యంగా దళిత సమస్యల పరిష్కారం కోసం అంబేడ్కర్ మార్గంలో పని చేస్తోందన్నారు.

### పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: డీఎడ్ రెండో సంవత్సరం విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు జూలై 10 లోపు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించాలన్నారు.

### విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో నరిగె నవీన్‌కు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆవు గుట్ట కింద పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయినట్లు తెలిపారు.

# ప్రజావాణికి వినతుల వెల్లువ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, తదితరులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 141 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ, ఆర్డీవో రవిలకు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కిరోసిన్ డబ్బాతో కలెక్టరేట్‌కు..



నగరంలోని నాగారంకు చెందిన బోదాసు రాజయ్య అనే దివ్యాంగుడు తన సమస్య పరిష్కరించాలని కిరోసిన్ డబ్బా తో సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు. పోలీసులు అప్రమత్తమై రాజయ్య వద్ద నుంచి కిరోసిన్ డబ్బా ఉన్న కవర్ లాక్కున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీస్‌లు జాగ్రత్తపడ్డారు. అనంతరం బాధితుడిని సముదాయించి పంపించేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ నాగారం శివారులో సర్వే నెంబర్ 2001/1లో తనకు ఇంటి స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఆ స్థలాన్ని రద్దు చేసి, స్వాధీనం చేసుకోవాలని కోరారు. అన్నిరకాలుగా నివాస యోగ్యంగా ఉన్న నగరంలోని సీతారాంనగర్ శివారులోగల ఈఎస్ఐ ఆస్పత్రి వెనకాల ప్రభుత్వ స్థలంలో 200 గజాల స్థలాన్ని ఇప్పించాలని కోరారు.

# కామారెడ్డిలో 75 ఫిర్యాదులు



కామారెడ్డిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న భిక్కనూరు కిరాణా అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మొత్తం 75 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 35 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా 20 ఫిర్యాదులు జిల్లా పంచాయతీ అధికారికి వచ్చాయి. మిగతావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. డీఆర్‌డీవో సాయన్న, కలెక్టరేట్ పాలనాధికారి రవీందర్ ఫిర్యాదులు స్వీకరించారు. డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**రూ.పది నాణెం తీసుకునేలా చూడాలి**

పది రూపాయల నాణేలను ప్రజలు వినియోగించేలా చూడాలని దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి కోరారు. వ్యాపారులు ప్రజలు రకరకాల కారణాలు చెబుతూ రూ.పది నాణెం తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

**పాలకవర్గం ఆగడాలను అరికట్టాలి**

పాలకవర్గంలోని ఓ వర్గం చేస్తున్న ఆగడాలను అరికట్టాలని కోరుతూ భిక్కనూరుకు చెందిన కిరాణా అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. 1995లో భిక్కనూర్‌లోని వ్యాపారులంతా కలిసి కిరాణా అసోసియేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. 2002లో అసోసియేషన్ తరపున 37 మంది సభ్యులు డబ్బులు పోగుచేసి 20 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గంలోని వారు ఓ వర్గంగా ఏర్పడి మిగతా సభ్యులకు సమాచారం లేకుండా భూమిని ఓ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లక్ష్మీనర్సింలు, గుంటుకు శంకర్, రవి, సత్యనారాయణ, గడ్డం రాములు, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

# డిప్యుటేషన్లలో ఇష్టారాజ్యం!

- టీచర్ల సర్దుబాటులో వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం
- అవసరం లేనిచోటకు వెళ్తున్న పలువురు సార్లు
- డీఈవో పేరిట ప్రొసీడింగ్‌లు ఇస్తున్న ఎంఈవోలు

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయులు అవసరం ఉన్న చోటకు పంపించడానికి విద్యాశాఖ టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చేపట్టింది. దీనిని కొందరు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఉపాధ్యాయుల అవసరం లేకున్నా.. తమకు దగ్గరలో ఉన్న పాఠశాలకు పలువురు డిప్యుటేషన్ వేయించుకుంటున్నారు. జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట మళ్లీ డిప్యుటేషన్ల ప్రక్రియ నడుస్తోంది. ప్రస్తుతం బడులు ప్రారంభమైన నేపథ్యంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిపోవడం లేదు. దీంతో మండల స్థాయిలలో టీచర్లను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆయా మండలాల అధికారులకు ఆదేశాలకు కూడా జారీ చేశారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమం కొనసాగుతోంది. అయితే ఈ ప్రక్రియలో బడుల అవసరాలను పక్కన పెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**బోధన మెరుగుపరచాలని..**

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 789, ఉన్నత పాఠశాలలు 269, ప్రాథమికోన్నత పాఠశాలలు 139 ఉన్నాయి. వీటి పరిధిలో 993 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో విద్యార్థులు తక్కువగా ఉండి టీచర్లు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను అవసరం ఉన్న బడులకు పంపడానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై పంపాల్సి ఉంటుంది. దీంతో విద్యా బోధన మెరుగవుతుందని ప్రభుత్వ ఆశించింది. కానీ కొందరు ఉపాధ్యాయులు తమ నివాసానికి, పట్టణ ప్రాంతాలకు దగ్గరగా సర్దుబాటు పేరిట వెళ్తున్నారు. వర్ని మండలంలోని ఓ ఎస్జీటీ డిప్యుటేషన్‌పై స్కూల్ అసిస్టెంట్‌గా బోధన్ ప్రాంతానికి వెళ్లారు. వాస్తవానికి అక్కడ టీచర్ అవసరం అంతగా లేదు. ఇదే మండలంలో అవసరమున్న ప్రాంతాల కంటే ఇతర మండలాల్లో అనువైన ప్రాంతాలకు వెళ్లిన వారే ఎక్కువగా ఉన్నారు. డిచ్‌పల్లి, నందిపేట మండల్లాలోని పాఠశాలలకు వెళ్లడానికి కొందరు టీచర్లు ఆర్డర్ల కోసం వేచి చూస్తున్నారు. బోధన్ మండలంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొందరు ఉపాధ్యాయులు బోధన్ పట్టణంతో పాటు జిల్లా కేంద్రానికి దగ్గర పాఠశాలలకు సర్దుబాటు పేరిట వచ్చారు. భీమ్‌గల్, మోర్తాడ్ మండలాల నుంచి జిల్లా కేంద్రానికి సైతం పలువురు టీచర్లు సర్దుబాటు పేరిట వచ్చారు. ఎంఈవోలు మండల పరిధిలోనే సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా జిల్లా విద్యాశాఖ అధికారి పేరిటా ప్రొసీడింగ్‌లు ఇస్తున్నారు.

**సంఘం నాయకులకు కాసుల వర్షం**

కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులకు ఈ సర్దుబాటు ప్రక్రియ కాసుల వర్షం కురిపిస్తుంది. ప్రధానం సంఘం నాయకులు సర్దుబాటులో అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టీచర్లకు అనుకూలమైన ప్రాంతాలను ఇప్పించేందుకు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. బోధన్ డివిజన్‌లోని ఓ టీచర్ తన సొంత ప్రాంతానికి వెళ్లేందుకు రూ.80 వేలు ఓ సంఘం నాయకుడికి చెల్లించినట్లు తెలిసింది. రాత్రికి రాత్రి ఉత్తర్వులు ఇచ్చి అతడిని అక్కడ సర్దుబాటు చేశారు. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన మరో నాయకుడు నిజామాబాద్ శివారు ప్రాంతానికి వచ్చేందుకు ఒక్కొక్క టీచర్ దగ్గర నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేశారు. ఉత్తర్వులు రాగానే డబ్బుల వసూలు చేపడుతున్నారు. సర్దుబాటు ప్రక్రియ ప్రారంభం కాని పాఠశాలల్లో ఉపాధ్యాయ సంఘం నాయకులు డిప్యుటేషన్ అవసరమున్న టీచర్లతో ప్రతిరోజు విందులు చేయించుకుంటున్నారు. అవసరం ఉన్న చోటుకు టీచర్లు వెళ్లకపోవడంతో విద్యార్థులు నష్టపోనున్నారు. సర్దుబాటు ప్రక్రియపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

**నిబంధనల మేరకు చేపడతాం**

ఉపాధ్యాయులను నిబంధనల మేరకే సర్దుబాటు చేస్తాం. అవసరం ఉన్న చోటకు టీచర్లను కేటాయిస్తాం. వ్యక్తిగత ప్రయోజనం కోసం సర్దుబాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. లోపాలు జరిగితే జిల్లా కార్యాలయంలోనే ప్రక్రియను చేపడతాం. – దుర్గాప్రసాద్, డీఈవో

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి





నిజామాబాద్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న సీనియర్ జడ్జి పద్మావతి, కామారెడ్డిలో.. ఏఎస్పీ అన్యోన్య

ఖలీల్‌వాడి: యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత కలెక్టరేట్ మైదానం నుంచి న్యూ అంబేడ్కర్ భవన్ వరకు కొనసాగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, ఏసీపీ కిరణ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారిణి ఎస్.కె. రసూల్ బీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం న్యూ అంబేడ్కర్ భవన్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వక్తలు ప్రసంగించారు. మాదక ద్రవ్యాల వినియోగ నిరోధంపై ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్లు కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రతాప్, మెప్మా అధికారి మాధురి, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ సంపూర్ణ, స్నేహ సొసైటీ సెక్రెటరీ సిద్దయ్య, గాడ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు శోభారాణి, ఏపీ ఫోరం అధ్యక్షుడు రమేశ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి క్రైం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ అన్యోన్య అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాల నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసుశాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఎస్పీ సురేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### బస్టాండ్‌లో పిల్లలను వదిలి వెళ్లిన మహిళ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ బస్టాండ్‌లో ఓ మహిళ ఇద్దరు పిల్లలను వదిలిపెట్టి వెళ్లినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. సోమవారం బోధన్ నుంచి బస్సులో నిజామాబాద్ బస్టాండ్‌కు మహిళ ఇద్దరు పిల్లలను తీసుకొని వచ్చింది. వారిని వదిలి మహిళ వెళ్లిపోవడంతో బస్టాండ్‌లో ఉన్న వారు పోలీసులకు సమాచారం అందించారు. పిల్లల పేర్లు కిరణ్, కార్తీక్ అని తెలిపారు. పిల్లల ఆచూకీ తెలిసిన వారు 8712659837, 9063344100 నంబర్లను సంప్రదించాలని కోరారు. బస్టాండ్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించి మహిళను గుర్తించడానికి పోలీసులు యత్నిస్తున్నారు.

### నేడు టెలీ కాన్ఫరెన్స్

నిజామాబాద్‌అర్బన్: ఇన్‌స్పైర్ అవార్డు మనక్–2023కు సంబంధించి మంగళవారం టీశాట్ చానల్ ద్వారా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమ్యే కాన్ఫరెన్స్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొనాలని కోరారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుభాష్‌నగర్: గత విద్యా సంవత్సరానికి సంబంధించి మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బకాయిలు రూ.8కోట్లు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్‌చేశారు. ఈమేరకు యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. కార్మికులు విధులను బహిష్కరించి మెరుపు సమ్మె చేపట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించేవరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని వర్షంలోనూ అక్కడే బీష్మించారు. ఎండీఎం నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారని తెలిపారు. 9 నెలలు ముగుస్తున్నా.. ఇప్పటివరకూ బిల్లులు రాలేవని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రూ.8కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, హన్మండ్లు, సాయమ్మ, గంగాధర్, నాగలక్ష్మి, భూమయ్య, ఉమా, ఉషారాణి పాల్గొన్నారు.

### డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాడి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ నెల 23న దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రామారెడ్డి మండలం కన్నాపూర్‌కు చెందిన బాల్‌నర్సు, కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన ఎరుకల రాజు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ నిందితులకు రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద: మండలంలోని హజ్గుల్, పుల్కల్ మంజీర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న పది ఇసుక టాక్టర్లను పట్టుకున్నామని తహసీల్దార్ భరత్ తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామన్నారు.

# భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



రెడ్డిపేటలో గుమిగూడిన ఇరువర్గాల ప్రజలు

రామారెడ్డి: భూ వివాదం విషయంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రామారెడ్డి మండలం రెడ్డిపేటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుభాష్‌కు మరొక వర్గానికి భూమి విషయంలో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఒక వర్గం వ్యక్తిపై సుభాష్ వర్గీయుల దాడి చేయగా ముగ్గురికి గాయాలయ్యాయి. సోమవారం సుభాష్ ఇంటిపై మరొక వర్గం వారు దాడి చేశారు. ఈ దాడిలో మరొక వ్యక్తికి తలకు గాయాలయ్యాయి. కోపంతో ఆటోలు, బైకులు మరొక వర్గం వారు ధ్వంసం చేశారు. ఇరువర్గాల దాడిలో సుభాష్, రాజు, రవి, రాజనర్సు, కొయ్యల రవి, కోయ్యాల లింబాద్రిలకు తీవ్ర గాయాలు కాగా వారిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకూడా చర్యలు చేపట్టారు. ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

### అశోక్‌సాగర్‌లో మృతదేహం లభ్యం

ఎడపల్లి: మండలంలోని అశోక్ సాగర్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయింది. ధోతి ధరించి దాదాపు 50 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి అశోక్ సాగర్‌లో సోమవారం శవమై తేలాడు. స్థానికులు ఎడపల్లి పోలీసులకు సమాచార అందించగా ఎస్సై పాండేరావు మృతదేహాన్ని బయటకు తీయించి, బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## క్రైం కార్నర్

### తక్కువ ధరకు బంగారమని టోకరా



నకిలీ బంగారు హారం

సదాశివనగర్: తక్కువ ధరకు బంగారు హారం అమ్ముతామని ఆశ చూపి ఓ బట్టల వ్యాపారికి గుర్తు తెలియని వ్యక్తులు రూ.మూడు లక్షలకు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సదాశివనగర్‌కు చెందిన ఆనంద్ స్థానికంగా ఓ బట్టల దుకాణం నడిపిస్తున్నాడు. ఈ నెల 14న ఓ వ్యక్తి అతని దుకాణానికి వచ్చి బట్టలు కొనుగోలు చేసిన తర్వాత మాట కలిపాడు. తాను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వాసిననీ, కొద్ది రోజులుగా డిచ్‌పల్లి ప్రాంతంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నట్లు చెప్పి పరిచయం చేసుకున్నాడు. తాను పని చేసేచోట బంగారు హారం ఒకటి దొరికిందని నమ్మించాడు. కిలోకు పైగా ఉండే ఆ హారాన్ని తక్కువ ధరకే విక్రయిస్తానని చెప్పి వెళ్లిపోయాడు. 17న అతనితో పాటు ఓ మహిళ, మరో వ్యక్తి ఆనంద్ దుకాణానికి వచ్చారు. వారి వెంట తీసుకువచ్చిన హారం చూపించి తెలిసిన చోట పరీక్షించుకోమని ఇచ్చారు. ఆనంద్ హారంలోని ఓ గుండును కత్తిరించి స్వర్ణకారుల వద్ద పరీక్షించుకోగా అసలైన బంగారం అని చెప్పారు. నమ్మిన ఆనంద్ వారితో మొత్తం హారాన్ని రూ.3 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. డబ్బులు సర్దుబాటు కాగానే ఈనెల 20న కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో వారిని కలిసి డబ్బులు చెల్లించి హారం తీసుకున్నాడు. రెండు రోజుల తర్వాత మరో చోట పరీక్షించగా హారం నకిలీదని తేలడంతో మోసపోయానని తెలుసుకుని లబోదిబోమన్నాడు. పోలీసులను ఆశ్రయించనున్నట్లు బాధితుడు ఆనంద్ తెలిపాడు.

# టోల్‌గేట్ బూత్‌లను ఢీకొన్న కంటైనర్




ధ్వంసమైన టోల్ బూత్

భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని టోల్ గేట్ వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో టోల్ బూత్ బాక్స్‌లు రెండు ధ్వంసమయ్యాయి. టోల్ గేట్ సిబ్బందికి ఒక్కరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కంటైనర్ అతి వేగంగా వచ్చి టోల్ గేట్ వద్ద ఉన్న డివైడర్‌తో పాటు రెండు బూత్ బాక్స్‌లను ఢీకొంది. దీంతో ఆరు, ఏడు బూత్ బాక్స్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారుపై టోల్‌బూత్ పడింది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. అలాగే ఆరో బాక్స్‌లో విధులు నిర్వహిస్తున్న తిప్పాపూర్ గ్రామానికి చెందిన పోచయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోచయ్యను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రొక్లెయినర్‌తో బోల్తా పడిన కంటైనర్‌ను పక్కకు తొలగించి ధ్వంసమైన బూత్ బాక్స్‌లను రోడ్డు పక్కకు తప్పించారు.

# కుమారుడి చికిత్స కోసం అప్పు..

- ఆర్థిక ఇబ్బందులతో తండ్రి ఆత్మహత్య



సుదర్శన్(ఫైల్)

నాగిరెడ్డిపేట: ఆత్మహత్యకు యత్నించిన కుమారుడిని అప్పు చేసి కాపాడుకున్న ఓ తండ్రి.. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన నాయికోటి సుదర్శన్(55) సోమవారం సాయంత్రం తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా సుదర్శన్ కొడుకు శ్రీకాంత్ మూడునెలల క్రితం పురుగుల మందు తాగాడు. కుమారుడిని ఆస్పత్రిలో చేర్పించిన సుదర్శన్ లక్షల రూపాయలు వెచ్చించి కాపాడుకున్నాడు. కాగా కొడుకు చికిత్స కోసం చేసిన అప్పులకుతోడు అంతకుముందున్న అప్పులతో సుదర్శన్ గత కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన సుదర్శన్ సోమవారం సాయంత్రం గ్రామశివారులోని తన పొలంవద్ద మామిడిచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు, మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఉమేశ్ తెలిపారు.

### చిరుత దాడిలో మేక మృతి

లింగంపేట: మండలంలోని సురాయిపల్లితండా సమీపంలో సోమవారం చిరుతపులి మేకపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మౌలానా మేకలను కాపరి అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లాడు. నంద్యాల కుంట వద్ద మధ్యాహ్నం చిరుతపులి పొదల చాటు నుంచి వచ్చి మేకల మందపై దాడి చేయడంతో మేకలు చెల్లాచెదరుగా పరుగులు తీశాయి. చిరుతపులి ఒక మేకను నోట కరుచుకుని లాక్కెళ్లింది. కేకలు వేయడంతో కొద్ది దూరంలో వదిలిపెట్టి వెళ్లినట్లు మేకల కాపరి తెలిపాడు. తండా సమీపంలో చిరుత మేకల మందపై దాడి చేయడంతో తండా వాసులు బయాందోళనకు గురవుతున్నారు.

CHANGE OF NAME
I, SHABNAM RASHEED D/o. MIRZA RASHEED BAIG (Old Name) have changed my Name as HOORUNNISA BEGUM, W/o. MOHAMMED SHARFUDDIN (New Name) R/o. H.No. 6-26-616/1/B, Nizam Colony Aarsapally, Nizamabad. (T.S.)

GNANODAYA HIGH SCHOOL
(V) Manchippa, (M) Mugpal, (Dist) Nizamabad
WANTED TEACHERS
Wanted Teachers to teach All Subjects from Nursery to VII Class E/M and Computer Operator
Note : English Fluency is Must B.Ed. or D.Ed.
Salary : 6,000/- to 8,000/- + TA
(Auto Provided to Teachers from Nizamabad to School)
CELL NO: 97042 25053, 75695 18989

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఉచిత వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [H.793449]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.